# ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

- జిల్లా అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తా
- జడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి
- ములుగు స్థానాన్ని సీఎంకు కానుకగా అందిస్తాం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

గోవిందరావుపేట, అక్టోబర్ 7 : ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయమని ములుగు జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని కమ్మ సంఘం ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సూరపనేని సాయికుమార్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరగగా, నాగజ్యోతితో పాటు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు, మండల ఇన్‌చార్జి సాంబారి సమ్మారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో ములుగు జిల్లా ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. పల్లె పల్లెనా బీఆర్ఎస్‌కు ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారని, పలు పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఆమె అన్నారు. జిల్లా అభివృద్ధికి తాను శాయశక్తులా కృషి చేస్తానన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, వారికి ఏ ఆపద వచ్చినా తాను ముందుంటానన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా అందజేస్తామన్నారు. అనంతరం మండల ఇన్‌చార్జి, మాజీ వైస్ చైర్మన్ సాంబారి సమ్మారావు మాట్లాడుతూ ములుగు జిల్లాపై బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని, అందుకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రతి ఒక్కరి గుండెల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ చిరస్థాయిగా నిలిచారని సమ్మారావు అన్నారు. సమావేశంలో ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ తుమ్మల హరిబాబు, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, మండలాధ్యక్షుడు పిన్నింటి మధుసూదన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి లకావత్ నర్సింహనాయక్‌తో పాటు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై అభినవ్

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

కాటారం, అక్టోబర్ 7 : ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, గ్రామస్తులు ముందుకు వచ్చి వాటిని ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై అభినవ్ సూచించారు. మండలంలోని గుమ్మళ్లపల్లిలో శనివారం సీసీ కెమెరాల ఆవశ్యకత, ఎన్నికల విధానంపై ఆయన గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. అలాగే రాబోయే ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా సహకరించాలని కోరారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

## నిబంధనలు పాటించాలి

మల్హర్, అక్టోబర్ 7 : తాడిచెర్ల–కాపురం టీఎస్ జెన్ కో భూనిర్వాసితుల సంక్షేమ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలతో కొయ్యూరు పోలీస్ స్టేషన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా రెండు నెలలు ఎలాంటి సభలు, సమావేశాలు, ధర్నాలు చేయొద్దని, ముఖ్యంగా తాడిచెర్ల డేంజర్ జోన్‌లో నివాసం ఉండే ప్రజలు ఓపిక పట్టాలని సూచించారు. త్వరలో ఎన్నికల నియమావళి అమలులోకి వస్తుందని, లా అండ్ ఆర్డర్ సమస్యలు వస్తాయని తెలిపారు. సమావేశంలో సీఐ రంజిత్, ఎస్సై నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా హరిబాబు జన్మదిన వేడుకలు

కృష్ణకాలనీ, అక్టోబర్ 7 : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జయశంకర్ సెంటర్‌లో టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు పటేల్ 45వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు మున్సిపల్ కౌన్సిలర్లు, మెకానిక్ అసోసియేషన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కాశీంపల్లిలో 12, 13 వార్డుల బీఆర్ఎస్ అధ్యక్షులు మేనం రాజేందర్, గండి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ మంగళపెల్లి తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంతోష్‌కుమార్ యాదవ్, మోకిడి అశోక్ పాల్గొన్నారు.

## ముగ్గురు తహసీల్దార్ల బదిలీ

ఏటూరునాగారం, అక్టోబర్ 7 : ములుగు జిల్లాలోని పలు మండలాల తహసీల్దార్లను బదిలీ చేస్తూ శనివారం సాయంత్రం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏటూరునాగారానికి వెంకటాపురం తహసీల్దార్ సృజన్‌ను నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న సంధ్యారాణి కన్నాయిగూడెంకు బదిలీ చేశారు. కన్నాయిగూడెం తహసీల్దార్ సలీముద్దీన్‌ను వెంకటాపురంకు బదిలీ చేశారు.


సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో రవీంద్రనాథ్

## నాణ్యమైన భోజనం అందించాలి

మహదేవపూర్, అక్టోబర్ 7 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో రవీంద్రనాథ్ బీసీ వసతి గృహ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని బీసీ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏపీవో రమేశ్, సిబ్బంది తదితరులున్నారు.

## రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలు

ములుగు రూరల్, అక్టోబర్ 7 : ములుగు మండల పరిధిలో శనివారం రాత్రి జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన దుగిని కుమార్ శనివారం పని నిమిత్తం హనుమకొండకు లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన గోస్కుల బన్నీతో కలిసి కొత్తగా కొనుగోలు చేసిన బైక్‌పై వెళ్లాడు. రాత్రి ఇంటికి తిరిగి వస్తూ జంగాలపల్లి వద్ద అదుపు తప్పి కిందపడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వారిని ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం డాక్టర్ సూచన మేరకు అక్కడి నుంచి ఎంజీఎంకు తరలించారు. అలాగే మండలంలోని పందికుంట గ్రామానికి చెందిన బాదావత్ చందు పని నిమిత్తం మల్లంపల్లికి తన బైక్‌పై వెళ్లి వస్తున్న క్రమంలో పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చందు కాలు, చేయికి తీవ్రగాయాలయ్యాయి. ప్రస్తుతం ములుగు దవాఖానలో క్షతగాత్రుడు చికిత్స పొందుతున్నాడు.

## ఎన్నికల ప్రవర్తనా నియమావళిని
# కట్టుదిట్టంగా అమలు చేయాలి

- కలెక్టర్ భవేశ్ మిశ్రా


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 7 : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై ఏఈఓలు, ఆర్‌వోలు, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్తు, టాయిలెట్లు, మంచినీరు, ఫర్నిచర్, ర్యాంపు వంటి మౌలిక వసతుల పూర్వయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. విధుల్లో ఉండే సిబ్బంది అందరూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించాలని, నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుందని అన్నారు. సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికలు సజావుగా ముగిసేలా కృషి చేయాలన్నారు. ఈసీ మార్గదర్శకాలను అధ్యయనం చేయాలని, రిపోర్టులు సకాలంలో సమర్పించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమాదేవి, ఇంజినీరింగ్ అధికారులు, ఈఈఎస్‌లు, డీటీలు తదితరులు పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం అల్పాహారం అందజేయాలి

- స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్


విద్యార్థులకు ప్లేట్లు అందజేస్తున్న స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 7: విద్యార్థులకు మెనూ ప్రకారం అల్పాహారం అందజేయాలని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. భూపాలపల్లి ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాలలో శుక్రవారం ప్రారంభమైన కేసీఆర్ అల్పాహార పథకం నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్ అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. అల్పాహారం, మధ్యాహ్న భోజనం నిమిత్తం పాఠశాలలోని 282 మంది విద్యార్థులకు సొంత డబ్బులతో ప్లేట్లను తెప్పించి విద్యార్థులకు అందజేశారు. అనంతరం డీఈవో కార్యాలయాన్ని సందర్శించారు. గొల్ల బుద్ధారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మండల రవీందర్ రెడ్డిని ఏసీజీఈగా నియామక పత్రాన్ని ప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో డీఈవో ఎన్ రాంకుమార్, శనిగరపు భద్రయ్య, కృష్ణమోహన్, సేవానాయక్, మొగిలి పాల్గొన్నారు.


## కుమారస్వామికి జాతీయ సేవారత్న అవార్డు

కృష్ణకాలనీ, అక్టోబర్ 7 : జాతీయ సేవారత్న అవార్డుకు భారత జాగృతి దివ్యాంగుల సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు కొయ్యడ కుమారస్వామి ఎంపికయ్యారు. ప్రతి ఏటా బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో సామాజిక సేవా సంఘ సంస్కర్తలకు ఈ అవార్డును అందజేస్తున్నారు. ఈ మేరకు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ శనివారం ఆహ్వాన పత్రాన్ని కుమార స్వామికి అందజేశారు. కుమార స్వామి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగుల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడంలో చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 15న న్యూఢిల్లీలో జరిగే ఆల్ ఇండియా బహుజన రైటర్స్ నేషనల్ కాన్ఫరెన్స్‌లో కుమారస్వామి అవార్డును అందుకోనున్నారు.

## కోటను సందర్శించిన 'వరల్డ్ హెరిటేజ్ వలంటీర్లు'

ఖిలావరంగల్/వెంకటాపూర్, అక్టోబర్ 7 : వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా 16 రాష్ట్రాలకు చెందిన 40 మంది విద్యార్థులు శనివారం ఓరుగల్లు కోటను సందర్శించారు. కాకతీయుల చరిత్ర, కట్టడాల నిర్మాణాల శైలిని ట్రైనింగ్ విద్యార్థులకు అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్ వివరించారు. రాతి, మట్టికోట నిర్మాణాలు, ద్వారాలు, బావులు, ఖుష్‌మహల్ తదితర కట్టడాలను వారు వీక్షించారు. కాగా, తొలుత వలంటీర్లకు రామప్పలోని పాత గెస్ట్ హౌస్ ఆవరణలో యోగా గురువు రాంబాబు రెండు గంటల పాటు శిక్షణ ఇచ్చారు. జీవీఎస్ సూర్యనారాయణ మూర్తి కాకతీయ కల్చరల్ లాండ్ స్కేప్ అండ్ ఆర్కిటెక్చర్‌పై వివరించారు. కాంపెయిన్‌లో భాగంగా వరంగల్ కోట, వేయిస్తంభాల గుడిలను సందర్శించగా వాటి ప్రాముఖ్యత ఇంజనీరింగ్ టెక్నాలజీ, కళ్యాణ మండపం పునర్నిర్మాణంలో తీసుకుంటున్న చర్యల గురించి పాండురంగారావు వివరించారు. యోగా మాస్టర్ శ్రీనివాస్, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు శ్రీధర్‌రావు, కేయూ స్కాలర్ కొక్కుల ప్రశాంత్, ట్రస్టు సభ్యుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఆడబిడ్డలకు కానుక బతుకమ్మ చీరెలు


బతుకమ్మ చీరెలను అందజేస్తున్న జడ్పీటీసీ సాగర్

చిట్యాల, అక్టోబర్ 7 : ఆడబిడ్డలకు పండుగ కానుకగా బతుకమ్మ చీరెలను సీఎం కేసీఆర్ అందిస్తున్నారని జడ్పీటీసీ గొర్రె సాగర్ అన్నారు. శనివారం నైన్‌పాక రైతువేదికలో సర్పంచ్ తొట్ల లక్ష్మీబాయమ్మ అధ్యక్షతన గ్రామ మహిళలకు బతుకమ్మ చీరెలు, యువకులకు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని, కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో మహిళలు, రైతులు, వృద్ధులు, దివ్యాంగులు, కుల వృత్తుల సంక్షేమానికి పాటుపడుతూనే అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత క్రీడా కిట్లను యువకులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కట్టెకోళ్ల రమేశ్, పంచాయతీ కార్యదర్శి విష్ణు, వార్డు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

### మహదేవపూర్‌లో..

మహదేవపూర్ : మండల కేంద్రంతో పాటు బొమ్మాపూర్, సూరారం తదితర గ్రామాల్లో బతుకమ్మ చీరెలను ప్రజా ప్రతినిధులు, అధికారులు మహిళలకు అందజేశారు. కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బండం పుష్పలత, సర్పంచ్ ఓడేటి పద్మా రవీందర్ రెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

### మల్హర్‌లో..

మల్హర్ : మండల కేంద్రంతో పాటు తాడిచర్ల, మల్లారం, పెద్దతూండ్ల, కొండంపేట, నాచారం తదితర గ్రామాల్లో శనివారం బతుకమ్మ చీరెలను ప్రజా ప్రతినిధులు, అధికారులు మహిళలకు అందజేశారు. నాచారంలో సర్పంచ్ కాసగాని రాజయ్య కేసీఆర్ క్రీడా కిట్లను యువకులకు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మహిళలు, క్రీడాకారులు పాల్గొన్నారు.